క్లుప్తంగా

శేష గణపతికి పూజలు



గుడివాడ టౌన్: స్థానిక విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామిని శ్రీ శేష గణపతిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

నేడు ప్రసాదం లడ్డూ వేలం

భక్తులు స్వామికి సమర్పించుకున్న ప్రసాదం లడ్డూ సోమవారం వేలం వేస్తామని ఆలయ ఈఓ ప్రసాద్ తెలిపారు. అనంతరం స్వామిని పట్టణ పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేస్తామని పేర్కొన్నారు.

సామూహిక లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్‌లోని కోర్టు ప్రాంగణం ఎదుట న్యాయవాదుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిరిలో ఆదివారం సామూహిక లక్ష్మీ గణపతి హోమం జరిగింది. ప్రతి ఏటా న్యాయమూర్తులు ఈ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.సుధారాణి, పి.గాయత్రి, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్యశిబిరం



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక నీలామహల్ రోడ్‌లోని అల్లంబడి ఆవరణలో విజయవాడకు చెందిన కామినేని హాస్పిటల్ వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. 213 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కేవలం రూ. 300కు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.శివ రామకృష్ణ, కార్యదర్శి కె. రామారావు, కోశాధికారి కె.రామకృష్ణ, వైద్యులు డాక్టర్ ఎల్.వర్ధన్, డాక్టర్ సాయి ప్రమోద్, డాక్టర్ అజయ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పామర్రు: తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు శివారు పిల్లివాని లంక ప్రజలు కృష్ణానది వరద ప్రవాహానికి సర్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వల్లూరిపల్లి గణేష్ పాల్గొన్నారు. అదేవిధంగా తోట్లవల్లూరు మండలం పాములలంక గ్రామంలోని వరద బాధితలకు నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే అందజేశారు.

అప్సా డెమోక్రటిక్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) డెమోక్రటిక్ గుడివాడ డివిజన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. స్థానిక స్లేటర్ పేటలోని రెయిన్‌బో హైస్కూల్లో నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా అర్జా ప్రసాదు, కార్యదర్శి ఎల్.జగదీష కోశాధికారి ఎల్.శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా ఎ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి. దామోదర్, ఎం.నరసింహారావు, పి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ ఎస్.శారద, కార్యవర్గ సభ్యులు ఎల్.స్రవంతి, టి. శోభాకుమారి, టీవీ రమణకుమారి, హేమంత్‌రెడ్డి, శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు.

జై జై గణేశా.. బై బై గణేశా.!

ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవం

జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా తొమ్మిదో రోజు గణనాథుల నిమజ్జనోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నా, పెద్దా, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా ఉత్సాహంగా గణనాథుల గ్రామోత్సవాల్లో పాల్గొనడం విశేషం.



పామర్రులో గణపతి గ్రామోత్సవం



గుర్రాల్లంకలో గణేష్ నిమజ్జన ఊరేగింపు



గుర్రాల్లంకలో వినాయక నిమజ్జన ఊరేగింపులో తీన్మార్ డప్పుల బృందం



కూచిపూడిలో గణనాథుడి ఊరేగింపు



గుడ్లవల్లేరు మండలం దాణా ఫ్యాక్టరీ వద్ద నిమజ్జన ఊరేగింపు

పమిడిముక్కల: పంచాయతీ పరిధిలోని గుర్రాల్లంకలో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహాన్ని ప్రతిష్టించి తొమ్మిది రోజులుగా ఉత్సవాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమం, చిన్నారులకు ఊయల ఉత్సవం జరిపారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు. ఆదివారం వినాయక విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి స్థానికంగా ఉన్న బందర్ కాలువలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విశాఖపట్టణానికి చెందిన పవన్‌కుమార్ తీన్మార్ డప్పుల మహిళా బృందం చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పామర్రులో..

పామర్రు: గణపతి నవరాత్రుల్లో భాగంగా అనేక చలువ పందిళ్లలోని వినాయకస్వామి నిమజ్జనోత్సవాలను ఆదివారం చేశారు. స్థానిక రజిక బజారులోని విఘ్నేశ్వరస్వామిని గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం స్వామిని నిమజ్జనం చేశారు. స్థానిక బాపూజీ పేటలోని స్వామిని గ్రామంలో ఊరేగించి అనంతరం కాలువలో నిమజ్జనం చేశారు. మండల పరిధి జమీదగ్గుమిల్లిలోని వినాయకస్వామికి ఆదివారం ఘనంగా పూజాదికాలను చేశారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలో గణనాథుడి ఊరేగింపులు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. తొమ్మిది రోజులు విశేష పూజలందుకున్న వినాయక విగ్రహాలను ఆదివారం కలిసి రావటంతో పెద్ద ఎత్తున ఊరేగింపుగా నిమజ్జనానికి యువత, పెద్దలనే తారతమ్యాలు లేకుండా తీసుకెళ్లారు. పెదపూడి, పెడసనగల్లు తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున అన్న సమారాధనలు నిర్వహించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలో వాడవాడలా వినాయక చవితి నవరాత్రి వేడుకలను ముగించుకున్న నిర్వాహకులు ఆయా విగ్రహాలను ఊరేగిస్తూ ఆదివారం నిమజ్జనం చేశారు. దాణా ఫ్యాక్టరీ వద్ద విగ్రహం, సంతరోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరా యూత్ వారి విగ్రహాలను కనక డప్పుల వాయిద్యాల మధ్య ఊరేగించారు. అడుగడుగునా విఘ్నరాజుకు మహిళా భక్తులు హారతులు పట్టి పండ్లు, టెంకాయలను సమర్పించారు. అలాగే సింగలూరులో స్వామివారికి అన్న సమారాధను నిర్వాహకులు చేపట్టారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి పుట్టలో పాలు పోసేందుకు, పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

అందరి కోసం ప్రజాస్వామ్యం ఏర్పాటు

మండవల్లి: ప్రజలందరికీ ప్రయోజనం కలిగించడానికే ప్రజాస్వామ్యం ఏర్పాటు చేశారని, ప్రజాస్వామ్య పరిరక్షణ జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు అన్నారు. స్థానిక గ్రంథాలయం వద్ద అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం పురస్కరించుకుని వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంటే ప్రజలే యజమానులు అని అర్థం అని పేర్కొన్నారు.

ఉనికిలిలో పారిశుద్ధ్య పనులు

మండవల్లి: మండలంలోని ఉనికిలిలో సర్పంచ్ ఇమ్మడి అన్నమ్మ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రహదారులపై సున్నం, బ్లీచింగ్ చల్లించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రహదారులపై చెత్త ఉంటే అంటువ్యాధులు సోకే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. దీంతో రహదారులను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు.

బాధితులకు సరుకుల కిట్ల పంపిణీ

నందివాడ: మండలంలోని వరద ముంపు గ్రామాల్లో హెచ్‌సీఎల్ సంస్థ సమకూర్చిన నిత్యావసర సరుకుల కిట్లను మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ఉదయం పంపిణీ చేశారు. మండలంలోని ఓద్దుల మెరక, చేదుర్తిపాడు పరిసర గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులతో కూడిన 500 కిట్లను ఎంపీ, ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. నష్టపోయిన బాధిత కుటుంబాలను ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. వరద బాధిత గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుడివాడ జనసేన పార్టీ ఇన్‌చార్జి శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు సన్యాసిరావు, నాయకులు రవి, సాంబశివరావు, నరేష్, రమేష్, తారక రామారావు, గుడివాడ జనసేన పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరలు పాల్గొన్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ఇలపర్రు గ్రామంలో..

నందివాడ: మండలంలోని ఇలపర్రు గ్రామంలో శ్రీ ద్వారకామాయి సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆదివారం కూరగాయలు, దుస్తులు, వంట సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ ట్రస్టు ప్రెసిడెంట్ దండిమూడి సీతారామస్వామి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సెక్రటరీ డి.నారాయణమూర్తి, సభ్యులు పాండురంగారావు, ఈశ్వరమ్మ, ఫణిశ్రీ, సాంబమూర్తి పాల్గొన్నారు

మురికి కూపంగా వాసవీనగర్



గుడివాడ వాసవీనగర్‌లో ఇళ్ల మధ్యలో నిల్వ చేరిన మురుగునీరు

గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్ నాగవరప్పాడులోని వాసవీనగర్ మురుగు నీటితో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. కొంతకాలంగా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కచ్చా డ్రెయిన్లు పూడుకుపోయాయి. మురుగునీరు రోడ్లపైనే తిష్టవేస్తున్నాయి. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షపు నీరు తోడు కావడంతో మురుగంతా రోడ్లపైనే తిష్ట వేసింది. కొన్ని ప్రాంతాల్లో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి కారణంగా రాత్రయితే దోమలు దాడులు చేస్తున్నాయని వాపోయారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పక్కా డ్రెయిన్‌లు నిర్మించక పోయినా కనీసం మురుగునీరు బయటకు పోయేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పామర్రు డ్రెయిన్ నిండిపోవడంతో ఇంటి ఆవరణలోకి చేరిన మురుగు నీరు

ఇళ్లలోకి డ్రెయిన్ నీరు

పామర్రు: పామర్రు మురుగు డ్రెయిన్‌లో నీరు దిగువకు ప్రవహించని కారణంగా నీరు ఇళ్లలోకి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో డ్రెయిన్‌లో చెత్త తూడు కాడ, గుర్రపు డెక్క నిండిపోయింది. దీంతో మురుగునీరు దిగువనకు ప్రవహించక పోవడం వలన వర్షం నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి డ్రెయిన్‌లో ఉన్న చెత్త, గుర్రపు డెక్క, తూడుకాడలను తొలగించాలని కోరుతున్నారు. అదేవిధంగా పామర్రు చల్లపల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న డ్రెయిన్లు సక్రమంగా లేని కారణంగా వర్షాల సమయంలో రోడ్డు వర్షపు నీటితో నిండిపోతోందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించందేకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో పాల పొంగళ్లను పొంగించి మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం ఆదివారం వేలాది సంఖ్యలో భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

వాటర్ ట్యాంక్‌తో నీటి సరఫరా



మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడులో గ్రామస్తులకు సర్పంచ్ బేతపూడి యేసోబురాజు తాగునీటిని సరఫరా చేయిస్తున్నారు. ఇటీవల సంభవించిన వరదలకు గ్రామంలోని మంచినీటి చెరువు కలుషితమైంది. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా సర్పంచ్ వాటర్ ట్యాంక్‌ను తీసుకొచ్చి ప్రజలకు నీటి సరఫరా చేయిస్తున్నారు.

దుస్తుల పంపిణీ

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఆదివారం ప్రత్యేక వాహనంలో దుస్తులను పంపారు. ఈ మేరకు కాలేజీ ప్రిన్సిపాల్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: ముంపు కారణంగా నిండా మునిగిన ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. కలిదిండి మండలం గుర్వాయిపాలెం పంచాయతీ శివారు మద్వానిగూడెంలో ఉప్పుటేరు కారణంగా ముంపు బారిన పడిన ఎస్సీ వాడలో ఆదివారం పర్యటించారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ముంపు నీటిలో అనేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం ఇంతవరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయలేదని డీఎన్నార్‌కు చెప్పారు. దీంతో ఆయన తహసీల్దారు, ఎంపీడీఓతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణం ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఇక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టూరి మురళీకృష్ణ, మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, గుర్వాయిపాలెం ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్లు కె.సత్యనారాయణ, అయినాలా బ్రహ్మాజీ, నీలపాల వెంకటేశ్వరరావు, కలిదిండి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వడుపు రామారావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, పోసిన కొండ, మద్దాని రాణి పాల్గొన్నారు.



కలిదిండి మండలం మద్వానిగూడెం ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న డీఎన్నార్

రాష్ట్ర స్థాయి పాలీ ఫెస్ట్‌లో విద్యార్థుల విజయఢంకా

గుడ్లవల్లేరు: రాష్ట్ర స్థాయి పాలీ ఫెస్ట్‌లో 2024కు సంబంధించి గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు స్టేట్ టాపర్లగా నిలిచి విజయఢంకా మోగించారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ ఆదివారం విలేకరులకు తెలిపారు. సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్‌లో ఈ నెల 13, 14వ తేదీల్లో రాష్ట్ర స్థాయి టెక్నికల్ ఫెస్ట్ ఆదిత్య పాలీ ఫెస్ట్, పాలీ వేద- 2024లను డిప్లొమా విద్యార్థులకు నిర్వహించారని చెప్పారు. పాలీ వేద-2024 పోటీలో తమ కాలేజీలో చదువుతున్న ఎండీ దావూద్ ఖాన్, కె.వి.జ్యోతి ప్రకాష్ తలపడి 'ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ నానో స్పాట్ వెల్డింగ్ మెషిన్' అనే అంశంలో రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానాన్ని సాధించారని తెలిపారు. 'ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్' అనే అంశంపై సీహెచ్.జగదీష్‌కుమార్, ఎ.వి.ఎస్.అక్షయ్, ఎ.తరుణ్ ఫణీంద్ర, డి.నవీన్‌బాబుకు రాష్ట్ర స్థాయి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. విజేతలతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన మెకానికల్, ఈసీఈ విభాగాధిపతులు, అధ్యాపకులను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు అభినందించారు.



విజేతలతో ప్రిన్సిపాల్ రాజశేఖర్

ముంపు బాధితులకు సాయం

కైకలూరు: స్థానిక పంచాయతీ 7, 8, 9 వార్డులలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరి దెబ్బతిన్న కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యం, కందిపప్పు, మంచినూనె, పంచదారను వార్డు సభ్యులు ఆదివారం పంపిణీ చేశారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు కేవీఎస్ఎం నాయుడు, సమతం శ్రీనివాసరావు, బెల్లాన్ని శ్యామలరావు, శ్రీనివాసరావు, రమ్య, సుధ పాల్గొన్నారు.

వడాలిలో అన్నసమారాధన

ముదినేపల్లిరూరల్: మండలంలోని వడాలి శివారు అప్పారావు పేటలో ఆదివారం అన్నసమారాధన జరిగింది. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఈ సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని గణనాథుడికి పూజలు చేసి సమారాధన ప్రారంభించారు. సమారాధనలో రెండు వేల మందికి పైగా పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పార్టీ పటిష్టానికి కృషి చేయాలి

పార్టీ పటిష్టంగా ఉండాలంటే అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు కావాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి ఎన్డీఏ కార్యాలయం వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు.



సమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

సీతారాం ఏచూరికి ఘన నివాళి



గన్నవరం: కమ్యూనిస్టు ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించిన ఘనత సీతారాం ఏచూరికి దక్కుతుందని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గన్నె మాట్లాడుతూ సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై ఏచూరి రాజీలేని పోరాటం చేశారని పేర్కొన్నారు. గత మూడు దశాబ్దాలుగా దేశ వ్యాప్తంగా ఎన్నో పోరాటాలకు ఆయన ఊపిరి పోశారని గుర్తు చేశారు. అటువంటి పోరాటయోధుడిని కోల్పోవడం సీపీఎంకు, దేశానికి తీరని లోటని తెలిపారు. సీపీఎం నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, సామాజికవేత్త డాక్టర్ ఎం. విజయకుమార్, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టిన కారు

కృత్తివెన్ను: పల్లెపాలెం వాటర్‌ప్లాంటు వద్ద విజయవాడ నుంచి ఆదివారం తెల్లవారుజామున భీమవరం వైపునకు వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్పగాయాలైనట్లు సమాచారం. 216 జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. హైవేపై వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం సీతనపల్లి వద్ద కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలు పాలుకాగా, అదే రోజు సాయంత్రం లక్ష్మీపురం సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఇసుక గుట్టను బైక్ ఢీ కొని మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తరచూ జరుగుతున్న ప్రమాదాలపై అధికారులు దృష్టి సారించి త్వరగా పరిష్కార చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

